# ఫ్లాష్ బ్యాక్

పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం



## సినిమాల్లో పాటలు పాడడం అంత తేలిక కాదు

## - ఎస్.పి. శైలజ

### (విజయచిత్ర – 1994 సంచిక నుంచి పునర్ముద్రితం)

సినిమాకి కథ ఎంత ముఖ్యమో, పాటలు, సంగీతం కూడా అంతే ముఖ్యం. అరవయ్యేళ్ల సుదీర్ఘ చలనచిత్ర చరిత్రని పరిశీలించి చూస్తే, సినిమాల పేర్లు గుర్తు ఉన్నా, లేకపోయినా వాటి లోని పాటలు మాత్రం మన హృదయాల్లో పీఠం వేసుకున్నవి అనేకం ఉన్నాయి. నేటికీ కొన్ని కొన్ని పాటల్ని గుర్తుకు తెచ్చుకుని మనలో మనం పాడుకునే సందర్భాలు అనేకం. మన దేశంలో ' పాట'కి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందనడానికి

ఇదొక్కటే నిదర్శనం.

ఒక పాట బహుళ ప్రాచుర్యం పొందాలంటే దాని వెనుక ఎంతో మంది కృషి ఉండాలి. ఉంటుంది కూడా! ఆ కృషే గాని లేకపోతే ఎంత మంది ఎంత శ్రమపడినా అది బూడిదలో పోసిన పన్నీరులా, వృధా అవుతుంది.

సాధారణంగా రంగస్థలం మీద కచేరీలో ఒక పాట పాడితే, శ్రోతలు ఆ పాట విని బావుంటే బావుందని, లేకపోతే లేదని మనసులోనే అనుకుని, బయటికి వెళ్లిన తర్వాత చర్చించుకుంటారు. కానీ, సినిమా పాట విషయంలో అలా కాదు. ఇక్కడ సంగీత దర్శకుడిని, రచయితని, దర్శకుడిని .... ఆ తర్వాత సినిమా చూసే ప్రేక్షకులనీ రంజింపజేయాలి.

సంగీత దర్శకుడు, రచయిత, దర్శకుడు ఆమోదిస్తే తప్ప 'పాట' ప్రేక్షకుల సమక్షంలోకి వెళ్లదు. ఒకసారి ప్రేక్షకుల మధ్యకి వెళ్లిన పాట వారి ఆమోదం కూడా పొందితేనే గాని ఆ పాటకి గుర్తింపు ఉండదు. పాటకి గుర్తింపు లభించనప్పుడు పాడిన వారికీ గుర్తింపు లభించదు.

అంచేత, అందరూ అనుకుంటున్నట్టుగా సినిమాల్లో పాటలు పాడడం అంత తేలిక కాదు. ఒక్కోసారి ఎంతో అనుభవజ్ఞులైన గాయనీ గాయకులకు సైతం “ఈ పాట నేను పాడగలనా?”, “పాడి శ్రోతలను మెప్పించగలనా?” “ఒక వేళ నేను సరిగా పాడలేకపోతే..”. అనే సందేహాలు కలగడమూ, మనసుని కలవర పరచడమూ కద్దు. అటువంటి సందర్భాల్లో గాయనీ గాయకులు మానసికంగా చాలా వ్యధకి గురి అవుతూంటారు. సరిగ్గా అలాంటి అనుభవాలే నాకు రెండు సందర్భాల్లో ఎదురయ్యాయి.

దాదాపు పదేళ్ల క్రితం ... ఓ రోజు సుప్రసిద్ధ దర్శకులు కె. విశ్వనాథ్ గారి నుండి కబురొచ్చింది. ‘సాగర సంగమం' చిత్రంలో ఓ పాట పాడాలి. రికార్డింగ్ థియేటర్ కి రమ్మనమని. విశ్వనాథ్ గారి చిత్రంలో పాట పాడడం అనగానే ముందు

కొంచెం భయం వేసింది. ఎందుకంటే ఆయన చిత్రాల్లోని పాటలు దాదాపు అన్ని శాస్త్రీయ సంగీత ధోరణిలో వుంటాయి. నాకు మామూలు పాటలు పాడడమే సరిగ్గా రాదు. పైగా నాకు శాస్త్రీయ సంగీతంలో ప్రవేశం గానీ, అనుభవంగాని లేవు. నిజం చెప్పాలంటే, అసలు నేను సినిమాల్లో పాటలు పాడతానని ఎన్నడూ ఊహించలేదు.

ఒకసారి మా అన్నయ్య బాలూ గారితో కలసి రికార్డింగ్ థియేటర్ కి వెళ్లాను. అక్కడ ప్రసిద్ధ సంగీత దర్శకులు చక్రవర్తిగారు ఉన్నారు. ఆయన నన్ను చూసి .. "ఏమ్మా నువ్వు కూడా సినిమాల్లో పాడతావా!" అన్నారు. తమాషాగా, నవ్వుతూ. ఆ క్షణంలో నాకు సిగ్గూ, భయమూ కలిగాయి. ఐతే, ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకే నాకు సినిమాల్లో పాటలు పాడే అవకాశం రావడం, అప్పటి నుంచీ అడపాదడపా, ‘హాబీ' గా పాటలు పాడడం ప్రారంభించాను.

ఇలా ఉండగా ఓ రోజు విశ్వనాథ్ గారు నన్ను 'సాగర సంగమం' చిత్రంలో నటించమని అడిగారు. నేను 'ససేమిరా' చెయ్యనన్నాను. ఆయన మరింత పట్టుబట్టి – 'మంచి పాత్రమ్మా! మిస్ అవకు' అని ఎంతగానో నచ్చజెప్పి ఒప్పించాలని చూశారు. అయినా నేను ఒప్పుకోలేదు. చివరకి ఆయన మా అన్నయ్యతో మాట్లాడి, అన్నమయ్య ద్వారా నా చేత ఒప్పించారు. అన్నయ్య విశ్వనాథ్ గారికి ఇచ్చిన మాట కాదనడం తప్పని — చివరికి ఆ చిత్రంలో నటించడానికి అంగీకరించాను.

అలాంటిది – ఇప్పుడు పాట కూడా పాడమంటున్నారేమిటి? – అని ఒకింత ఆశ్చర్యపోయాను. అంతలోనే డ్రైవర్ కారు తీసుకురావడం — నేను కార్లో రికార్డింగ్ థియేటర్ కి బయల్దేరడం జరిగింది.

రికార్డింగ్ థియేటర్లోకి వెళ్లిన తర్వాత నన్ను ఆశ్చర్యానికి గురిచేసిన మరో సంఘటన ఏమిటంటే ... దర్శకులు విశ్వనాథ్, సంగీత దర్శకులు ఇళయరాజా గార్లతో పాటూ మా అన్నయ్య కూడా అక్కడ వుండడమే.

నేను ఆశ్చర్యంలోంచి తేరుకోక ముందే మా అన్నయ్య నా దగ్గరకొచ్చి, 'శైలా! ఇది చాలా అద్భుతమైన పాటమ్మా సినిమాలో నీ మీద చిత్రీకరించబోయే పాట ఇది. ముందు ఈ పాటని వేరొక గాయని చేత పాడించాలని అనుకున్నారు. కానీ, నువ్వూ సినిమాల్లో పాటలు పాడుతున్నావు కదా! అంచేత నీ మీద చిత్రీకరించబోయే ఈ పాట నీ చేతనే పాడిస్తే ఇంకా బావుంటుందని విశ్వనాథ్ గారు, ఇళయరాజాగారు అన్నారు. అందుకే పిలిపించాము' – అన్నారు.

మామూలుగా పాట పాడాలంటేనే ఒక విధమైన జంకు ఉండేది అప్పట్లో. పైగా వేరొక గాయని పాడాల్సిన పాట నేను పాడాల్సి రావడం అనుకోకుండా జరిగిన సంఘటనే అయినా, నాకు కొంచెం ఇబ్బందిని కలిగించింది. ఐనా, ఆ పరిస్థితిలో నేను కాదని ఎలా అనగలను? 'సరే'నన్నాను.

కొంత సేపటికి పాట కాగితాలు నాకు ఇచ్చారు. 'ఆర్కెస్ట్రా అంతా రెడీ! నువ్వు పాడడమే ఆలస్యం. సాహిత్యం ఒక్కసారి చదువుకోమ్మా' అన్నారు విశ్వనాథ్ గారు.

సాహిత్యం ఒకసారి చదువుకున్నాను. 'వేదం అణువణువున నాదం' అనే పాట అది. పాడడానికి ప్రయత్నించాను. ఒకసారి .... రెండుసార్లు ... మూడు సార్లు ... ఊహుఁ ...... నావల్ల కాలేదు. పాట నా నోటికి పట్టుబడడం లేదు. ముందే చెప్పానుగా! మామూలు పాటలు పాడడమే అంత సరిగారాదు అని. ఇక శాస్త్రీయ సంగీత బాణీలో సాగే ఈ పాటని పాడాలంటే నా తరమా!

ఆ రోజు ఉదయం 9 గంటల నుంచీ సాయంత్రం వరకూ అలా ప్రయత్నిస్తూనే ఉన్నాను. అయినా నా వల్ల కావడం లేదు. సరిగా పాడకపోతే విశ్వనాథ్ గారూ, ఇళయరాజా గారు ఎక్కడ తిడతారోనన్న భయం ఒక ప్రక్క. మరో ప్రక్క మా అన్నయ్య. మా అన్నయ్య ఎదురుగా ఉంటే నాకు నోట్లోంచి మాటే రాదు. ఇక పాట ఎలా పాడగలను?

ఇలా నేను భయాందోళనల మధ్య ఊగిసలాడుతూంటే తమిళంలో 'ఎన్నమ్మా! రెడీయా' (ఏమ్మా రెడీయా) అని ఇళయరాజా గారు ఇంకో ప్రక్క నుంచి తొందర చేస్తున్నారు.

ఇక నా పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి! ఒళ్లంతా ముచ్చెమటలు పట్టేశాయి. కాళ్లూ, చేతులు వణికి పోతున్నాయి. ఏం చెయ్యాలో తెలీని అయోమయావస్థలో– బిత్తర చూపులు చూడడం ప్రారంభించాను.

అప్పుడు అన్నయ్య నా దగ్గరకి వచ్చి, "ఏంటమ్మా శైలా, ఏంటి నీ ప్రాబ్లమ్?" అని అడిగారు.

'నాకు శాస్త్రీయ సంగీతం రాదు. అలాంటి పాటలు నేను పాడలేనని నీకు తెలుసు కదా! అలాంటప్పుడు ఈ పాటని వేరే వాళ్ల చేత పాడించకూడదా, అన్నయ్యా' అన్నాను ప్రాధేయ పూర్వకంగా.

అప్పుడు అన్నయ్య చిరునవ్వు నవ్వి, "స్వరం, రాగం బాగుండాలంటే శాస్త్రీయ సంగీతం నేర్చుకోవాలి అంటాను, అదే గాని నువ్వు నేర్చుకుని ఉంటే నీకీనాడు ఇంత భయం ఉండేది కాదు' అని "సార్, ఈ పాట శైలా రేపు పాడుతుంది. ఇప్పుడు 'నెర్వస్'గా ఫీలవుతోంది. ఇలాంటి పరిస్థితిలో పాడించినా మనం అనుకున్న' ఎఫెక్ట్' రాదు. మీకభ్యంతరం లేకపోతే రేపు పాడిద్దాం" అని విశ్వనాథ్ గారికీ, ఇళయరాజా గారికీ చెప్పారు.

'ఏం ఫరవాలేదు. రేపే పాడిద్దాం' అన్నారు వారిద్దరూ.

ఆ క్షణంలో నేను పొందిన ఆనందం ఇంతా అంతా కాదు. ఎగిరి గెంతెయ్యాలనిపించింది. అంతలా మనసు తేలికయింది. వెంటనే అన్నయ్యతో పాటు కార్లో ఇంటికెళ్లి, ఆ రోజు రాత్రంతా ఆ పాటని దాదాపు నలభైసార్లు 'ప్రాక్టీసు' చేశాను.

మర్నాడు ఉదయం రికార్డింగ్ థియేటర్ లో భయం భయంగానే పాడేశాను. గమ్మత్తేమిటంటే. మొదటి రోజు అంతగా భయపడిన నేను ఆ మరునాడు అదే పాటని మొదటి టేక్ లోనే ఓకే అయ్యేట్టు పాడాను.

ఆ తర్వాత, 'ఓస్ ఇంతేనా! దీనికేనా నేను అంత భయపడ్డాను' అనుకున్నాను. అంతకుముందు నాలో ఉన్న భయం ఆనాటితో పూర్తిగా తొలగిపోయింది.

అయితే అలా జరగడానికి పరోక్షంగా మా అన్నయ్య సహాయమూ ఎంతో ఉంది. అది ఎలాగంటారా .... ఆ రోజు ఆయన రికార్డింగ్ దగ్గరకి రాకపోవడమే!

రంగస్థలం మీద కచేరీల్లో లలిత గీతాలు పాడేసి, సినిమాల్లో పాడగలం అనుకుని సినిమాల్లో ప్రవేశించిన వారిలో చాలామంది పైకి రాలేకపోవడానికి కారణం – శాస్త్రీయ సంగీతంలో తగినంత ప్రవేశం లేకపోవడమే నన్న సత్యం బోధపడింది. శాస్త్రీయ. సంగీతం ... అందులోనూ కర్నాటక సంగీతంలో బాగా ప్రవేశం సంపాదించిన వారు ఎలాంటి పాటలనైనా అవలీలగా పాడగలరు అనే సత్యాన్ని తెలుసుకున్నాను.

ఈ సంఘటన తర్వాత వెంటనే మా అన్నయ్య నన్ను సుప్రసిద్ధ శాస్త్రీయ సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గారి వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకొమ్మని పంపారు. ఆ నాటి నుండి – ఈ నాటి వరకూ ఆయన వద్ద శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసిస్తూనే ఉన్నాను.

నేనీనాడు మంచి గాయనిగా పేరు తెచ్చుకోవడానికి, పరిశ్రమలో స్థిరపడడానికి ప్రసిద్ధ గాయనీమణులు పి. సుశీల, ఎస్. జానకి గార్లు కారణం అని చెప్పాలి. వారిద్దరే నాకు ఇన్స్పిరేషన్." ఇది నా చలనచిత్ర జీవితంలో క్లిష్టమైన తొలి ఘట్టం.

ఇక రెండో సంఘటన .....

మా అన్నయ్యకి, సుప్రసిద్ధ హిందీ చలనచిత్ర నేపథ్య గాయని లతా మంగేష్కర్ గారికి 'పిన్నమనేని 'అవార్డు లభించినప్పుడు బహుమతి ప్రదానోత్సవానికి నేను వెళ్లాను. అప్పుడు, ఆ సభలో హఠాత్తుగా మా అన్నయ్య, 'మధుమతి' (హిందీ) చిత్రంలో లత గారు గానం చేసిన 'ఆజారే పరదేశి' అనే గీతాన్ని నన్ను పాడమన్నారు. నాకు గుండె దడ ప్రారంభమైంది.

ముందు చెప్పకుండా, అప్పటికప్పుడు హఠాత్తుగా అంత గొప్ప గాయని పాడిన 'పాప్యులర్' పాటని – ఆవిడ సమక్షంలో, సభికుల ముందు పాడమనడంతో నాకు విపరీతమైన భయం కలిగింది. ఎలా పాడడమా? అని ఆలోచిస్తున్నాను. అంతలోనే అన్నయ్య – 'ఏం భయం లేదు. పాడు' అని ప్రోత్సాహించారు.

'సరే! ఇక కాదంటే బాగోదని' ఎలాగోలా పాడేశాను. పాట పాడడం పూర్తి అయిన తర్వాత లతగారు నన్ను దగ్గరకు తీసుకుని 'చాలా బాగా పాడావమ్మా' అని అభినందించారు.

ఏం చెప్పాలో తెలీక – 'నేను బాగా పాడటమేమిటండీ! నిజానికి మీరు మధురంగా పాడిన పాటని నేను ఖూనీ చేసేశాను', అన్నాను ఆవిడతో.

అప్పుడు ఆవిడ 'బాలు చెల్లెలివని చెప్పడం కాదు. నిజంగానే ఈ పాటని నువ్వు బాగా పాడావు. నీకు మంచి భవిష్యత్తు ఉందమ్మా' అని ఆశీర్వదించారు. ఆ క్షణంలో నాకు తెలియకుండానే నా కళ్లు చెమర్చాయి.

★★★

COMMENTS